నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ సోమవారం 25 నవంబర్ 2024 | ADILABAD NIRMAL

## అంధకారంలో ఆకొండపేట

### రాత్రివేళ లో వెలుగని బల్బులు

దస్తురాబాద్, నవంబర్ 24 : పల్లెలు చీకట్లో మగ్గుతున్నాయి. వీధిదీపాలు వెలుగక గ్రామీణులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకొండపేట గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు రాత్రివేళల్లో బల్బులు వెలుగక అంధకారంలో ఉంది. రాత్రి వేళ వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. పాడైన చోట కొత్త విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



చీకటిలో ఆకొండపేట గ్రామంలోని పలు కాలనీలు

## చల్లగ చూడు తల్లీ..



కుచులాపూర్ గ్రామస్తులతో కలిసి నెత్తిన బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు, నవంబర్ 24 : కుచులాపుర్ గ్రామంలో యేటా జరిగే పోచమ్మ తల్లి బోనాల జాతర కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాల మధ్య ప్రత్యేకంగా ఆహ్వానించి సన్మానించారు. అనంతరం నెత్తిన బోనం ఎత్తుకుని గ్రామస్తులతో కలిసి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోచమ్మ తల్లీ దీవెనలు ఎల్లప్పుడు నియోజకవర్గ ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ తోట వెంకటేశ్, కేదారేశ్వర్‌రెడ్డి, అభిరాంరెడ్డి, సునీతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రత్నమాల తిరుమల గౌడ్, సురేందర్, గజానంద్, రవికాంత్, శ్రీనివాస్, కుచులాపూర్ పాల్గొన్నారు.

# డీఈవో గారూ.. కేజీబీవీలపై పర్యవేక్షణేదీ?

## కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సమస్యల తిష్ట

- సమయపాలన పాటించని ఉపాధ్యాయులు
- వసతి గృహాల్లో నైట్ డ్యూటీలకు ఎస్‌వోలు దూరం
- ఘటనలు జరిగినా తూతూ మంత్రంగా విధులు
- షోకాజ్ నోటీసులు జారీ చేసిన వీడని నిర్లక్ష్యం

నిర్మల్ అర్బన్, నవంబర్ 24 : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. విద్యార్థులను ఉత్తములుగా, విజ్ఞానవంతులుగా, భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన టీచర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలకు వచ్చామా? పాఠాలు చెప్పామా? వెళ్లామా? అనే ధోరణిలో వ్యవహరించడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రధానంగా ఉపాధ్యాయుల, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా శనివారం కలెక్టర్ అభిలాష అభినవ్ మామడ కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేయడంతో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం, ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ ఎలా ఉందో వెల్లడైంది. దీంతో ప్రత్యేకాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేసి, విధుల్లో నిర్లక్ష్యం వ్యవహరించిన ఎస్‌వో, ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులను జారీ చేసి పద్ధతి మార్చుకోవాలని ఆదేశించారు.

### సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

జిల్లాలోని 18 కేజీబీవీలలో కొంతమంది ఉపాధ్యాయులు ఇష్టారీతిన సమయపాలన పాటించడం లేదు. పాఠశాలకు సమయానికి చేరుకున్న తర్వాత లొకేషన్‌ను షేర్ చేయాల్సి ఉండగా లైట్‌గా తీసుకుంటున్నారు. ఉదయం 9.15 గంటలకు ప్రార్థన సమయంలో విద్యార్థులతో కలిసి పాల్గొనాల్సి ఉండగా.. 10 గంటల తర్వాత విధులకు హాజరవుతున్నట్లు తనిఖీల్లో వెల్లడైంది. గతంలో నిర్మల్ డీఈవోగా విధులు నిర్వర్తించిన రవీందర్‌రెడ్డి ఖానాపూర్‌లోని కేజీబీవీని తనిఖీకి చేయగా ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలలో ఉన్నారు. మిగతా వారందరూ ఇష్టారీతిన పాఠశాలకు రావడంతో పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇది ఒక్క ఖానాపూర్ కేజీబీవీలోనే కాకుండా మిగతా కొన్ని కేజీబీవీల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని తేటతెల్లం అవుతున్నది. తనిఖీలు చేసిన రెండు, మూడు రోజులు సమయపాలన పాటించి ఆ తర్వాత షరామామూలుగా వ్యవహరిస్తున్నారు.

### వసతి గృహాల్లో నైట్ డ్యూటీలకు ఎస్‌వోలు దూరం

కేజీబీవీల్లో ప్రత్యేక అధికారులు విధులు నిర్వహిస్తుండగా.. దాదాపు 6 వేల మంది చదువుకుంటున్నారు. సీఆర్టీలు, పీజీ సీఆర్టీలు మాత్రమే నైట్ డ్యూటీలు నిర్వహిస్తున్నారు. ప్రతి కేజీబీవీలో ప్రత్యేక అధికారి(ఎస్‌వో) వారానికి రెండు రోజులు వసతి గృహాల్లో నిద్రించి విద్యార్థుల ప్రగతి, వారి బాగోగులు, సమస్యలను తెలుసుకుని సమస్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి. సోన్, నర్సాపూర్(జి) ఎస్‌వోలు మినహా ఇతర ఎస్‌వోలు నైట్ డ్యూటీలు నిర్వహించకుండా విద్యార్థుల పర్యవేక్షణను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

### ఘటనలు జరిగినా వీడని అలసత్వం

జిల్లాలోని కేజీబీవీల్లో ఘటనలు జరిగినా ఉపాధ్యాయుల్లో చలనం రావడం లేదు. గతంలో నర్సాపూర్(జి) కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ అయి కొంత మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన కారణంగా అప్పటి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఎస్‌వోను విధుల నుంచి తొలగించి, అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కేజీబీవీలను నిత్యం పర్యవేక్షించాల్సిన సెక్టోరియల్, డీఈవో అధికారులు వసతి గృహాలపై పర్యవేక్షణ లేకపోవడంతో ఎప్పుడూ ఏం జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో విద్యావ్యవస్థ గాడిన పడాలంటే విద్యాశాఖ అధికారులతోపాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ అవసరం. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈవో రామారావుతోనైనా కేజీబీవీ పాఠశాలల్లో మార్పు వస్తుందని ఆశిద్దాం.

### నిరంతరం పర్యవేక్షణ చేస్తాం..



నిర్మల్ జిల్లాలోని కేజీబీవీలపై నిరంతరం పర్యవేక్షణ చేపడుతాం. పాఠశాల ప్రార్థన సమయానికి ఉపాధ్యాయులందరూ హాజరుకావాలి. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక అధికారులు వసతి గృహాల్లో నిద్రించేలా చర్యలు తీసుకుంటాం.

*- రామారావు, డీఈవో, నిర్మల్.*



కేజీబీవీని తనిఖీ చేసి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



లక్ష్మణచాంద కేజీబీవీని సందర్శించిన జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు

## గ్రామ దేవతలను మరవొద్దు

తాంసి(భీంపూర్), నవంబర్ 24 : గ్రామ దేవతలు పాడి పంటలు, సుఖశాంతులు ఇస్తాయని, వారిని మరవద్దని ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదివారం భీంపూర్ మండల శివారులో గల బద్ది పోచమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోని పోచమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం నిపాని గ్రామాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ నాగయ్య, మాజీ జడ్పీటీసీ సుధాకర్, నాయకులు జహూర్ అహ్మద్, మడావి లింబాజీ, సంజీవ్‌రెడ్డి, రవికాంత్, రాజన్న, గంగయ్య, సంతోష్, అఫ్రోజ్ పాల్గొన్నారు.



బద్ది పోచమ్మను దర్శనం చేసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న



దిలావర్‌పూర్ : న్యూ లోలంలోని నర్సరీని పరిశీలిస్తున్న శిక్షణ అధికారులు

## ట్రెయినీ అధికారుల పర్యటన

### లక్ష్మణచాంద, దిలావర్‌పూర్ మండలాల పరిశీలన

లక్ష్మణచాంద/దిలావర్‌పూర్/సోన్/నర్సాపూర్(జి), నవంబర్ 24 : లక్ష్మణచాంద, దిలావర్‌పూర్, నిర్మల్, సోన్, నర్సాపూర్(జి) మండలాల్లో ఆదివారం ట్రెయినీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్, ఐఆర్‌ఎస్‌లు పర్యటించారు. లక్ష్మణచాంద మండలంలోని పొట్టపెల్లి(కే) గ్రామంలో ట్రెయినీ ఐఏఎస్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు, ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులు, కిచెన్ షెడ్డు, నర్సరీని పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవో రాధిక, ఎంపీవో అమీర్‌ఖాన్, ఏపీవో ప్రమీల, ఏపీఎం వాణిశ్రీ ఉన్నారు.

### దిలావర్‌పూర్ మండలంలో..

క్షేత్రస్థాయి శిక్షణలో భాగంగా ఐదుగురు శిక్షణ ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులు దిలావర్‌పూర్ మండలంలోని న్యూ లోలం గ్రామంలో పర్యటించారు. డ్వాక్రా మహిళ సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం నర్సరీ, పల్లె ప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. బీడీ పరిశ్రమ ద్వారా ఉపాధి పొందుతున్న మహిళలతో ముచ్చటించి, బీడీలు ఎలా చుడుతారో తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, ఈజీఎస్ ఏపీవో దివ్యారెడ్డి, ఏఈవో మౌనిక, ఐకేపీ ఏపీఎం సులోచనరెడ్డి, ఐడీసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్నకుమారి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఈజీఎస్ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు రమణ, గోవిందుల మహేశ్, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, ఐకేపీ సీసీలు ముత్యం, రాణి పాల్గొన్నారు.

### నిర్మల్, సోన్ మండలాల్లో..

నిర్మల్, సోన్ మండలాల్లోని నీలాయిపేట్, చిట్యాల్, బొప్పారం గ్రామాలను శిక్షణ ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్, ఐఆర్‌ఎస్‌లు సందర్శించారు. సంక్షేమ పథకాలు, వ్యవసాయం, డ్వాక్రా గ్రూపు సభ్యుల గురించి తెలుసుకున్నారు. వైకుంఠధామాలు, నర్సరీలు, డంపింగ్ యార్డులు, పాఠశాల, ఇంకుడుగుంతలను పరిశీలించారు. చేలలోకి వెళ్లి పంటల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో సంతోష్, ఆర్ఐ మోహన్ పాల్గొన్నారు.

### నర్సాపూర్(జి) మండలంలో..

నర్సాపూర్ (జీ) మండలంలో కేజీబీవీ విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఆశ, అంగన్‌వాడీలకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. 30 పడకల ఆసుపత్రిని సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ విజయ లక్ష్మి, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, నాయబ్ తహసీల్దార్ వహీద్ పాల్గొన్నారు.

## మెరిసిన ఆర్జీయూకేటీ విద్యార్థులు

బాసర, నవంబర్ 24 : ఆర్జీయూకేటీ బాసర మెకానికల్, మెటలర్జికల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థుల బృందం బిట్స్ పిలానీ హైదరాబాద్ వేదికగా ఈ నెల 22, 23వ తేదీల్లో నిర్వహించిన ఆటోవన్-24 రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ గోవర్ధన్ వారిని అభినందించారు. విద్యార్థుల జట్టు రూ.8 వేల నగదు బహుమతిని అందుకోవడం అభినందనీయం అన్నారు.



నగదు బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

## అడవులను సందర్శించిన అధికారులు

కడెం, నవంబర్ 24 : కడెం, ఉడుంపూర్ రేంజ్‌ల పరిధిలో శనివారం కలెక్టర్ అభిలాష అభినవ్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి శర్వానంద్ ఇతర అధికారులతో కలిసి అడవులను సందర్శించారు. వీరితోపాటు, వివిధ ప్రాంతాలకు చెందిన పక్షి పరిశీలకులు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా రెండు రేంజ్‌ల పరిధిలోని సఫారీ ట్రాక్, వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన గడ్డి క్షేత్రం, మైసంపేట రీలొకేషన్ ప్రాంతాలను అధికారులకు చూపించారు. అయితే అడవుల్లో వివిధ జాతులకు చెందిన పక్షులను పక్షి ప్రేమికులు వారి కెమెరాల్లో బంధించారు. కవ్వాల్ అభయారణ్యం పరిధిలోకి ఇటీవల వచ్చిన పులి వన్యప్రాణుల పరివర్తన విషయం గురించి చర్చించారు. అనంతరం నేచర్ సఫారీలో పర్యటించారు. కలెక్టర్ ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అటవీ అందాలను తిలకించారు. అనంతరం ఐలవ్ కవ్వాల్ టైగర్ లోగో వద్ద సందడి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి నాగిని భాను, డివిజన్ ఫారెస్ట్ అధికారి భవాని శంకర్, రేంజ్ అధికారి అనిత, డిప్యూటీ రేంజ్ అధికారి ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



అడవులను సందర్శించిన అధికారులు

## స్థానికంగా ఉండాలి

### ఆదిలాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలవ్య

బజార్‌హత్నూర్, నవంబర్ 24 : ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది స్థానికంగా ఉంటూ.. నిత్యం అందుబాటులో ఉండాలని అసిస్టెంట్ (ట్రెయినీ) కలెక్టర్ అభిజ్ఞాన్ మాలావ్య సూచించారు. ఆదివారం బజార్‌హత్నూర్, జాతర్ల, మాడగూడ గ్రామాల్లోని ఆశ్రమ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని నిల్వ ఉన్న సరుకులను పరిశీలించి స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు అందించే భోజనంపై ఆరా తీశారు. మెనూ ప్రకారం నిత్యం భోజనం అందుతుందో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ.. రాత్రి వేళల్లో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు పాల్గొన్నారు.

### కుంటాల ఆశ్రమ పాఠశాల తనిఖీ

నేరడిగొండ, నవంబర్ 24 : పదో తరగతిలో మంచి మార్కులు సాధించేలా కష్టపడి చదవాలని అసిస్టెంట్ కలెక్టర్ అభినవ్ అభిజ్ఞ గిరిజన విద్యార్థులకు సూచించారు. ఆదివారం మండలంలోని కుంటాల బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



బజార్‌హత్నూర్‌లోని బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించిన అభిజ్ఞాన్ మాలవ్య

## భక్తజన సందోహం.. లక్ష్మీనారాయణ క్షేత్రం

### భారీగా తరలివచ్చిన భక్తులు.. దర్శనం కోసం బారులు

జైనథ్, నవంబర్ 24 : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ స్వామి జాతర నాలుగో రోజైన ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లాతోపాటు నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, మహారాష్ట్ర నుంచి వేలాది మంది తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి దర్శన కోసం బారులుదీరారు. ఈ సందర్భంగా ఎస్సై పురుషోత్తం ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ జాతరను ఆలయ ఈవో వామన్‌రావ్, చైర్మన్ రుకేశ్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయం

## అమ్మవారిని దర్శించుకున్న తోగుట్ట పీఠాధిపతి

బాసర, నవంబర్ 24 : బాసర సరస్వతీ అమ్మవారిని తోగుట్ట పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని పుష్పార్చణలో పాల్గొన్నారు. అనంతరం కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన కార్తీక దీపోత్సవ కార్యక్రమానికి హాజరయ్యారు.




కార్తీక దీపోత్సవంలో పాల్గొన్న పీఠాధిపతి